క్లుప్తంగా

5న ఆలయ హుండీల కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయ హుండీలను తెరచి కానుకల లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

ఎంపీడీఓగా భారతి బాధ్యతల స్వీకరణ

పామర్రు: పామర్రు ఎంపీడీఓగా ఎం.భారతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ వై రామకృష్ణ ఆకివీడుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లా పీ గన్నవరంలో విధులు నిర్వహిస్తున్న భారతి బదిలీపై పామర్రుకు వచ్చారు. మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తొలుత ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలను తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.ప్రమీళ, కార్యదర్శులు అబ్దుల్ సలీం, కృష్ణ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

5న విగ్రహ ప్రతిష్ట

పమిడిముక్కల: మండలంలోని చోరగుడి శివారు గోపాలకృష్ణాపురంలో శ్రీ చలవ గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు మర్రి దుర్గారావు తెలిపారు. 83 కుటుంబాలకు సంబంధించిన 25 మందికి ఐదు ఎకరాల భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

మండవల్లి: మండవల్లి గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జలజీవన్ మిషన్ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు తాగునీటిని అందజేయడానికి ప్రభుత్వం కుళాయిలు ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ఏర్పాటు చేసి అందరికీ కుళాయిలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, ఉప సర్పంచ్ జొన్నలగడ్డ నాగలక్ష్మి, సభ్యులు గుడివాడ మురళి, దోసపూడి సత్యవతి, స్వాతి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



పామర్రు: బదిలీపై వెళ్లిన పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లిన భరత్‌రెడ్డిని సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, ఎన్నికల డీటీ జగన్మోహన్‌రావు, వీఆర్వోలు, వీఆర్యేలు కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ దంపతులను సన్మానించారు. ఏఎస్ఓ సుప్రియ, కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావు, రాము, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

ముదినేపల్లి రూరల్: బదిలీపై వెళ్తున్న మండల తహసీల్దార్ కె శ్రీనివాస్‌ను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బదిలీల్లో భాగంగా శ్రీనివాస్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్ తదితరులు సత్కరించారు.

తహసీల్దార్‌గా కుమారి

మండల తహసీల్దార్‌గా ఎస్ఎల్ఎన్ కుమారి నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కుమారికి ముదినేపల్లికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అంబేడ్కర్ విగ్రహానికి శంకుస్థాపన

పెదపారుపూడి: పెదపారుపూడి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ పానుగుమాటి రజిని, సర్పంచ్ చప్పిడి సమీరా, సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వరప్రసాద్, ఆదియ్య, శివరామప్రసాద్, జానకరామయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అవురూపూడిలో వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అవురుపూడి(మొవ్వ): పరిపాలనా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అవురుపూడిలో రూ.43.6 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.9 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.8లక్షల వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అంతకు ముందుగా రూ.20.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరు సీసీ రోడ్డులను ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, సర్పంచ్‌లు ఈడే వెంకట నాగలక్ష్మి, ఝూన్సీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత, ఓబీసీ నేస్తం, కాపు నేస్తం, డ్వాక్రా రుణమాఫీ తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి అక్కచెల్లెమ్మలపై ఉందన్నారు. కార్యక్రమంలో పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్, పామర్రు ఎంపీపీ డి.అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు(కొండలు), మొవ్వ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, నాయకులు యేనుగు శ్రీనివాస్, కుక్కల శ్రీను, మోహనరావు, శ్రీనివాసరెడ్డి, వెంకటరత్నం, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర దేశానికే ఆదర్శం



ఆక్వా హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు/కలిదిండి: మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని మరింత పెంచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్ర దుకాణాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండిలో రూ.85 లక్షలతో నిర్మించిన ఆక్వా హబ్, కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన ఫిష్ ఆంధ్ర డైలీ దుకాణాలను శుక్రవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రారంభించారు. దుకాణ యజమానులు హబిబుల్లాఖాన్, మారుబోయిన రేవతికి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు మాట్లాడుతూ 60 శాతం ఎస్సీ, ఎస్టీలకు, 40 శాతం బీసీలకు ప్రభుత్వం యూనిట్లలో సబ్సిడీ అందిస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్లు 125 ఉన్నాయన్నారు. ఫిష్ ఆంధ్ర లాంజ్, ఫిష్ ఆంధ్ర సూపర్, ఫిష్ ఆంధ్ర డైలీ దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. వీటన్నింటికీ ఆర్డర్ ప్రకారం కలిదిండి ఆక్వా హబ్‌ను నుంచి మత్స్య ఉత్పత్తులు సరఫరా చేయవచ్చన్నారు. కై కలూరు మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎస్‌కే.చాన్‌భాషా మాట్లాడుతూ కైకలూరు మండలంలో 15 ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఫిష్ ఆంధ్ర దుకాణాల్లో సముద్ర చేపలు, స్థానిక జాతులకు చెందిన బతికిన చేపలు, రొయ్యలు, పీతలు, పచ్చళ్లు, ఎండు చేపలు, మత్స్య ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, జెడ్పీటీసీ సభ్యులు సత్యవతి, బేబీ, కై కలూరు, కలిదిండి ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీర్రాజు, కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచులు దానం మేరీ నవరత్నకుమారి, మసీముక్కు మారుతి ప్రసన్న, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



అవురుపూడిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు తెలిపారు. హనుమంతపురం హైస్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న జగనన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొండమంచిలి మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యులతో కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైద్యులు బాలాజీ, రెహానా, తిలక్‌రావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్ కుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయదుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలకు ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలులో భాగంగా కూరాడలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 401 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకరరావు, ఈఓపీ ఆర్డీ వి.దిలీప్‌కుమార్, కార్యదర్శి సీహెచ్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

421 మందికి వైద్య సేవలు

అవురుపూడి(మొవ్వ): కార్పొరేట్ వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే చెందుతుందని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం అవురుపూడిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ శిబిరం ద్వారా అవురుపూడి, పాలంకిపాడు గ్రామాలకు చెందిన 421 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు నిడుమోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేవై విజయ్ తెలిపారు. డాక్టర్ కే వై విజయ్, డాక్టర్ కే విజయ కుమర్, డాక్టర్ కే ప్రసన్న సుందరి పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని వింజరంపాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. సుమారు 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంట్రప్రగడ పీహెచ్‌సీ వైద్యులు సందీప్, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ మొక్కల నరికివేతపై పరస్పర ఫిర్యాదులు

ముదినేపల్లి రూరల్: పొలంగట్లపై ఉన్న మొక్కలు నరికివేతపై స్థానిక పోలీసుస్టేషన్లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. మండలంలోని ములకలపల్లికి చెందిన పలుకుర్తి మంగమ్మ ఫిర్యాదు ప్రకారం గ్రామంలోని భూమికి సంబంధించి సరిహద్దు వివాదంపై మాట్లాడేందుకు పెద్దలు కొందరు ఆమె ఇంటికి వచ్చారు. ఆమె భర్త వెంకట్రావు వీఆర్వోగా పనిచేస్తూ విధులకు వెళ్లినందున తరువాత మాట్లాడదామని మంగమ్మ చెప్పగా కొంతమంది వ్యక్తులు తనకు సంబంధించిన భూమి వద్దకు వెళ్లి గట్టుపై ఉన్న సపోట, మామిడి, కొబ్బరిమొక్కలు నరికివేసి దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి గతంలో సర్వేయర్ కొలతలు నిర్ధారించిన తరువాత తమ గట్టుపై మొక్కలు నాటామని, వాటిని ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో మంగమ్మ పేర్కొన్నారు. ఇందుకు ప్రతిగా జంగం ఉషారాణి పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. మంగమ్మ భూమికి సరిహద్దున ఉన్న స్థలంలో అక్రమంగా మొక్కలు నాటారని దీనిపై ప్రశ్నించగా దుర్భాషలాడి మంగమ్మ దౌర్జన్యం చేసినట్లు ఉషారాణి ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ పోలీసు ఉద్యోగం కత్తిమీద సాములాంటిది

గుడివాడరూరల్: పోలీసు ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని టూటౌన్ సీఐ ఎంఎస్ దుర్గారావు పేర్కొన్నారు. గుడివాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శివాజీ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ దంపతులను సత్కరించారు. టూటౌన్ రైటర్ రమేష్ పాల్గొన్నారు.

■ పంచాయతీ చెరువు పరిశీలన

మండవల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ టి.విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ ఎన్‌వీ సత్యనారాయణ, చాలిపాడులోని ఫిషరీస్ సొసైటీ చెరువును శుక్రవారం పరిశీలించారు. గతంలో గ్రామ పంచాయతీ 13 ఎకరాలు చెరువును ఫిషరీస్ సొసైటీకి అందజేసింది. తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆ చెరువులో ఐదు ఎకరాలు మంచినీటి చెరువుకు ఇచ్చేవిధంగా ఇటీవల పంచాయతీ తీర్మానం చేసింది. ఇందుకు ఫిషరీస్ సొసైటీ సభ్యులు, తమ జీవనాధారం దెబ్బతింటుందంటూ ఆ చెరువులో ఐదు ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ పూర్ణచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ చెరువును పరిశీలించి విచారణ చేపట్టారు. డీఈ ఎంవీవీ శాస్త్రి, ఏఈఈ కృష్ణారావు, ఈఓఆర్డీ ఆనందబాబు, సర్పంచ్ ధనలక్ష్మి, కార్యదర్శి ఎం కొండలు పాల్గొన్నారు.

■ సిద్ధం సభకు తరలిరావాలి

తోట్లవల్లూరు: దెందులూరులో జరిగే సీఎం జగన్ సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ హనుమాన్‌జంక్షన్ సమీపంలో కార్యకర్తలకు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

■ బీమా సొమ్ము బాధితుడికి అందజేత

మండవల్లి: మండవల్లికి చెందిన గూడవల్లి రాజేంద్ర 2022 డిసెంబర్‌లో రూ.399 చెల్లించి పోస్టల్ ప్రమాదబీమా తీసుకున్నారు. 2023లో ప్రమాదానికి గురికావడంతో కుడి కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. బీమా ద్వారా వచ్చిన రూ.35,216 సొమ్మును శుక్రవారం పోస్టుమాస్టర్ సీతారామాంజనేయులు బాధితుడు రాజేంద్రకు అందజేశారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 12 మందికి ఉద్యోగాలు



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం చెన్నైకు చెందిన ఆల్‌సేక్ టెక్నాలజీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 12 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. మొత్తం 120 మంది విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనగా 12 మంది ఎంపికైనట్లు సంస్థ యాజమాన్యం శుక్రవారం ప్రకటించారు. ఎంపికై న వారికి ఏడాదికి రూ.3 లక్షల వేతనం నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకి-చినముత్తేవి ముదురు కాలువ గట్టుపై కొందరు జూదరులు కోళ్లకు కత్తులు కట్టి పందేలు వేస్తున్నారంటూ వచ్చిన సమాచారం మేరకు కూచిపూడి పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించినట్లు ఎస్ఐ డీ సందీప్ తెలిపారు. ఈ దాడిలో 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు పందెం కోళ్లు, ఆరు మోటార్ సైకిళ్లు, రూ.23,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు జగనన్న కాలనీలోని ప్రభుత్వ నివేశన స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయంలో 890వ నంబర్ ప్లాట్ గల లబ్ధిదారురాలు నడా ఆశాజ్యోతికి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో గంగాధరరావు, డిజిటల్ అసిస్టెంట్ సుస్మిత పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు సత్కారం

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డీటీవీ కృష్ణారావును స్థానికులు శుక్రవారం సత్కరించారు. గతంలో ఇదే పురపాలక సంఘంలో సేవలందించిన కృష్ణారావు తిరిగి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై రావడం అభినందనీయమని పేర్కొన్నారు. యోగా గురువు శ్రీనివాస్, సయ్యద్ గఫార్, సుబ్బారావు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొడాలి నాని



తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఉదయం సుప్రభాత సేవలలో ఆయన కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామన్నారు. శ్రీవారి దీవెనలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని, స్వామి వారి కృపతో మంచికోసం, ప్రజలకోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నామన్నారు.

జగన్ పాలనలో గ్రామాలకు మహర్దశ

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ముఖ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కలిదిండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మించిన ముఖ మండపం, పేట కలిదిండిలో రూ.80.40 లక్షల, ఈద్గా కాలనీలో రూ.55 లక్షలు, ఇందిరాకాలనీకి జలజీవన్ మిషన్ రూ.18 లక్షలు నిధులతో పైపులైను, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపను చేశారు. పడమటిపాలెం పంచాయతీ శివారు బరింకలగరువులో గడపగడపకు మన ప్రభుత్వం రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, అమరావతిలో రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్లు కొల్లాటి సత్యనారాయణ, నాయకులు సయ్యపురాజు గుర్రపురాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాలసుబ్రహ్మణ్యం



మున్సిపల్ కమిషనర్‌తో మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా జి.బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.బాలసుబ్రహ్మణ్యం 2007లో డిప్యూటీ తహసీల్దార్ హోదాలో రెవెన్యూ శాఖలో చేరారు. అనంతరం ఆయన తహసీల్దార్‌గా బందరు తదితర ప్రాంతాల్లో పనిచేశారు. పదోన్నతిపై జాయింట్ కలెక్టర్ కాకినాడకు బదిలీ అయిన ఆయన గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో పాటు అవనిగడ్డ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. బాధ్యతలు చేపట్టిన బాలసుబ్రహ్మణ్యంను అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, జోగా సూర్యప్రకాశరావు, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, నాయకులు వెంపల అప్పారావు, కె.ఆంజనేయ ప్రసాద్, ఎ.కృష్ణ మోహన్, టీవీ రమణ కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పెన్షన్ అందజేత



విజయవాడ ఆస్పత్రిలో పెన్షన్‌ను అందజేస్తున్న వలంటీర్ కిరణ్‌బాబు



మచిలీపట్నం వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ దివ్య

పామర్రు: పామర్రు సచివాలయం-4 పరిధిలో ఉంటున్న కనుమూరు వెంకటేశ్వరమ్మ అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలోని ఐసీయూలో ఉంటూ వైద్య సేవలను పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పామర్రు సచివాలయం-4 వలంటీర్ కిరణ్‌బాబు శుక్రవారం విజయవాడ వెళ్లి వెంకటేశ్వరమ్మకు పెన్షన్‌ను అందజేశారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సకాలంలో పెన్షన్ అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం కలకాలం ఉండాలని కోరారు.

మచిలీపట్నం వెళ్లి..

పామర్రు: మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పామర్రు మండలం ఇందిరానగర్‌కు చెందిన కాటం రోజా పుష్పానికి శుక్రవారం పెన్షన్‌ను అందజేశారు. పామర్రు సచివాలయం వలంటీర్ కాకుళ్ల దివ్య తన సొంత ఖర్చులతో మచిలీపట్నం వెళ్లి రోజా పుష్పానికి వృద్ధాప్య పెన్షన్‌ను అందజేశారు.

డాక్టర్ కేవీఏ పద్మనాభం మృతి



డాక్టర్ కేవీఏ పద్మనాభం (ఫైల్)

గుడివాడ టౌన్: ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ కేవీఏ పద్మనాభం (90) శుక్రవారం మృతి చెందారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు హోమియో వైద్యుడిగా సేవలందించిన ఆయన భారతదేశంతో పాటు విదేశీయులకు సైతం హోమియో వైద్య సేవలు అందించారు. వీరికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. డాక్టర్ అంత్యక్రియలు శనివారం ఉదయం గుడివాడలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పద్మనాభం మృతిపట్ల పట్టణంలోని ప్రముఖ వైద్యులతో పాటు హోమియో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి

పామర్రు: ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని గుడివాడ డీఎస్పీ పీ శ్రీకాంత్ అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీలో ఆటో డ్రైవర్లు, ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పామర్రు సీఐ శుభాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐలు వెంకటేశ్వరరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్షయింటు అనగా ముదినేపల్లి మండలం, పెయ్యేరు గ్రామ కాపురస్థులు శ్రీ కందుల కామేశ్వరరావు గారి కుమారుడు గోపాలకృష్ణ తనకు సంబంధించిన ఆస్తి తాలూకా దస్తావేజు నెంబరు 286/2007 (SRO ముదినేపల్లి) ఒరిజినల్ దస్తావేజు మరియు సదరు దస్తావేజుకు సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 623/1998 పోయినవి. కావున సదరు రెండు దస్తావేజులు ఎవరైనా దొరికినచో క్రింది చిరునామాకు అందజేయగలరు.

ఇట్లు, ఎస్. బెంజిమిన్
అడ్వకేట్ & నోటరీ,
గుడివాడ
ది. 2-2-2024 గుడివాడ. ఫోన్ : 94407 40022

శ్మశాన భూసేకరణకు ప్రతిపాదనలు

పమిడిముక్కల: పైడికొండలపాలెం శ్మశానభూమికి 87 సెంట్ల భూసేకరణకు రూ.7.06 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. దళితవాడలోని 135 కుటుంబాల వారు గత 40 సంవత్సరాలుగా మృతదేహాలను ఖననం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై తాను లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, కలెక్టర్‌ను నివేదిక కోరినట్లు తెలిపారు. లోకాయుక్త ఆదేశాల మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు శ్మశానభూమి సేకరణ నిమిత్తం రూ.7.06 లక్షలు మంజూరు చేయవలసిందిగా ప్రతిపాదనలు సమర్పించినట్లు పేర్కొన్నారు.

మెలకువలతో స్పందించాలి

గుడివాడ టౌన్: పోటీ పరీక్షల్లో ప్రశ్నలను గ్రహించడం ముఖ్యమని కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం స్థానిక గౌరీశంకరపురంలోని అంబేడ్కర్ భవన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశ్నలు చదివేటప్పుడే వాటి సమాధానం గుర్తించగలగాలన్నారు. అనంతరం 228 పేజీల మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com